RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 4, సంచిక : 29

శుక్రవారం
జనవరి 02, 2026

పేజీలు : 6
వెల : రూ.3-00



ఇంత అక్రమ సంపాదనా!

4లో..

# గులాబీ గూడు వదిలి..!

**- కల్వకుంట్ల ఇంట్లో 'సొంత' పోరు - రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా కవిత అంశం**



- ☐ జిల్లాల్లో పర్యటిస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పై ఘాటైన వ్యాఖ్యలు
- ☐ సొంత పార్టీ పెడితే నెగ్గుకు రాగలరా?
- ☐ తండ్రిని కాదని రాష్ట్ర ప్రజలు కూతురును స్వాగతిస్తారా?
- ☐ కలిసొచ్చేది ఎవరు? చెయ్యిచ్చేది ఎవరు?
- ☐ షర్మిలలా కాకూడదంటున్న అనుచరులు
- ☐ ఎక్కడికెళ్లినా ప్రజా సమస్యలపైనే పోరుబాట
- ☐ ఇప్పటికైతే బ్రహ్మరథం పడుతన్న ప్రజలు
- ☐ చివరిదాకా ఆదరణ ఉండేనా?!

3లో..

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఉద్యమ కాలం లో జాగృతి గళంగా మహిళలు, మేధావులు, విద్యా ర్థులతో అనుబంధం పెంచుకున్న కల్వకుంట్ల కవిత, ఇప్పుడు తన తండ్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, అన్న కేటీఆర్ నీడ నుంచి బయటకు వచ్చి స్వతంత్ర రాజకీ య అస్తిత్వం కోసం అడుగులు వేస్తున్నారు. బీఆర్ ఎస్‌లో ప్రాధాన్యత లేమిపై అసంతృప్తి, కుటుం బంలో తలెత్తిన అంతర్గత విభేదాలు ఇవన్నీ కలిపి ఆమె రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరలేపాయి. ఈ నేపథ్యంలో ఆమె కొత్త పార్టీ దిశగా అడుగులు వేస్తు న్నారా? అన్న ప్రశ్న రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అయితే... తెలంగాణ సెంటిమెంట్, మహిళా ఓటు బ్యాంకును నమ్ముకుని ఆమె 'మూడో ప్రత్యామ్నా యంగా' నిలబడగలరా? 'షర్మిల' అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని కవిత ఏయే వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు? ఆమె చేస్తున్న జిల్లాల పర్యటనల వెనుక ఉన్న అసలు మర్మమేంటి? తండ్రి నిర్మించిన సామ్రా జ్యాన్ని కాదని, సొంత ముద్ర వేయాలనుకుంటున్న కవిత రాజకీయ భవిష్యత్తుపై 'వేద న్యూస్' ఆసక్తికర విశ్లేషణాత్మక కథనం..

# ఏఐ దేశ ఆర్థిక భవిష్యత్తును నిర్ణయిస్తుంది

- 'ఏఐ ఫర్ బిగినర్స్' కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- స్కిల్ ది నేషన్ చాలెంజ్ ప్రారంభం
- ఒడిశాలో ఐజీఎన్ఓయూ ప్రాంతీయ, నైపుణ్య కేంద్రాల వర్చువల్ ప్రారంభం



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

రాబోయే దశాబ్దంలో కృత్రిమ మేధ (ఏఐ) దేశ స్థూల దేశీయోత్పత్తి, ఉపాధి అవకాశాలు, సమగ్ర ఉత్పాదకతలో కీలక పాత్ర పోషించనుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. రాష్టపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమం లో 'ఏఐ

మిగతా 3వ పేజీలో..

# సీఎంకు న్యూ ఇయర్ విషెస్

- మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ
- పోలీస్ జైళ్ల విభాగం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

నూతన సంవత్సరం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని పలువురు మంత్రులు, పలు విభాగాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరం రాష్ట్రానికి మరింత అభివృద్ధి, ప్రజలకు శుభఫలితాలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2026 సంవత్సరం తెలంగాణ ప్రజల జీవితాల్లో మరిన్ని సానుకూల మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు గడప గడపకూ చేరేలా అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ భేటీలో భాగంగా తెలంగాణ పోలీస్ జైళ్ల విభాగానికి సంబంధించిన నూతన డైరీ, క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. జైళ్ల నిర్వహణలో సంస్కరణలు, మానవీయ దృక్పథం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమం సౌహార్దపూర్వక వాతావరణంలో కొనసాగిందని సచివాలయ వర్గాలు వెల్లడించాయి.

# ప్రజల జీవితాల్లో మార్పు లేదు

- కాంగ్రెస్ పాలనలో క్యాలెండర్లే మారుతున్నాయి
- అభివృద్ధి కాదు.. రాష్ట్రం తిరోగమన దిశలో ప్రయాణం
- 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చూడటమే లక్ష్యం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

క్యాలెండర్లు మారుతున్నాయే తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలతో ఓటేసిన ప్రజల జీవితాల్లో మాత్రం ఎలాంటి సానుకూల



మార్పు రాలేదని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. గత రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశలో కాకుండా తిరోగమన దిశలో ప్రయాణిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, దేశ ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ భావోద్వేగభరితంగా ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు, అలాగే కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టకముందు ఉన్న పరిస్థితులు మళ్లీ రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయని కేటీఆర్ అన్నారు. పండుగ వాతావరణం ఉన్నప్పటికీ రైతులు యూరియా కోసం అవస్థలు పడుతున్నారని, చలికాలంలో కూడా గంటల తరబడి, దినాల తరబడి లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇది రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ

మిగతా 3వ పేజీలో..

# రూ.1.23 కోట్లు కొట్టేశారు !

- డిజిటల్ అరెస్ట్ పేరుతో ఘరానా మోసం
- సైబర్ నేరగాళ్లకు చిక్కిన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి
- వీడియో కాల్‌లో బెదిరింపులు
- ఇంటి శోధన పేరుతో మానసిక వేధింపులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

3లో..

# జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026 ప్రారంభం



- మంత్రి పొన్నం ప్రభాకర్
- జనవరి 1 నుంచి 31 వరకు రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు
- హెల్మెట్ల పంపిణీ, అవగాహన సామగ్రి విడుదల

**హైదరాబాద్,వేద న్యూస్ :**

ఖైరతాబాద్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించే ఈ మాసోత్సవాల ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా రహదారి భద్రత ప్రభుత్వ బాధ్యతతో పాటు ప్రతి పౌరుడి కర్తవ్యమని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని సూచించారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అధికారులకు స్వయంగా హెల్మెట్లు బహుకరించారు.

మిగతా 3వ పేజీలో..

# హనీ ట్రాప్ ముఠా గుట్టురట్టు

- మహిళలతో వల వేసి నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్
- రౌడీ షీటర్ తో పాటు ముగ్గురు అరెస్ట్
- బాధితుడి ఫిర్యాదుతో బయటపడిన దారుణ మోసం
- జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఘటన




**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి పట్టణంలో అమాయక వ్యక్తులను, ముఖ్యంగా ధనవంతులను టార్గెట్ చేస్తూ సాగుతున్న హనీ ట్రాప్ ముఠాను పోలీసులు ఛేదించారు. మహిళలతో వల వేసి ఏకాంతంలో ఉన్న సమయంలో నగ్న వీడియోలు తీసి, వాటిని సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తూ లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఈ ముఠా వ్యవహారం స్థానికంగా సంచలనంగా మారింది. మెట్‌పల్లి దుబ్బవాడకు చెందిన కోరుట్ల రాజ్‌కుమార్ అలియాస్ రాజు ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలోనే పలు నేరాల్లో పాల్పడిన రాజుపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో రాజు, భర్తకు దూరంగా ఉంటున్న బలుమూరి స్వప్న అనే మహిళతో కలిసి ఈ దందాకు తెరలేపినట్లు విచారణలో వెల్లడైంది. వీరితో పాటు బట్టు రాజశేఖర్, సుంకిటి వినోద్, పులి అరుణ్, మాగని దేవా నర్సయ్యలు ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. హనుమాన్ నగర్‌లో ఒక గదిని అద్దెకు తీసుకున్న ఈ ముఠా, మహిళల పట్ల బలహీనత ఉన్న ధనవంతుల ఫోన్ నంబర్లు సేకరించేది. అనంతరం స్వప్న ఫోన్‌లో కవ్వించేలా మాట్లాడి బాధితులను ఆ గదికి రప్పించేది. వారు లోపలికి వెళ్లి నగ్నంగా ఉన్న సమయంలో నిందితులు అకస్మాత్తుగా గదిలోకి ప్రవేశించి మొబైల్ ఫోన్లలో వీడియోలు తీసేవారు. ఆ వీడియోలను బయటపెడతామని బెదిరించి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మూడు నెలల క్రితం మెట్‌పల్లికి చెందిన ఒక వ్యాపారిని ఈ ముఠా టార్గెట్ చేసింది. డిసెంబర్ 28న అతడిని గదికి పిలిపించి నగ్న వీడియోలు తీసి, విషయం బయటకు రాకుండా ఉండాలంటే రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే చంపేస్తామని బెదిరించారు. బాధితుడు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించడంతో ముఠా గుట్టురట్టైంది. పోలీసులు కోరుట్ల రాజుతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో గతంలో చేసిన బ్లాక్ మెయిల్ వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. సోషల్ మీడియా, అపరిచిత ఫోన్ కాల్స్‌ను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని వి. అనిల్ కుమార్ తెలిపారు.

# గవర్నర్‌కు సీఎం విషెస్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**



సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించినట్లు సీఎం పేర్కొన్నారు. ఈ భేటీ సౌహార్దపూర్వక వాతావరణంలో కొనసాగిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# శ్రీవారి దర్శనం చేసుకున్న భట్టి విక్రమార్క

**వేద న్యూస్, తిరుమల ప్రతినిధి:**



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనం అనంతరం రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా, సంతోషంగా, ఆర్థికంగా బలంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగాలని, రాష్ట్రం మరింత ప్రగతిపథంలో అడుగులు వేయాలని శ్రీవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. తిరుమలలో భక్తుల సందడి మధ్య భట్టి విక్రమార్క దర్శనం ప్రశాంతంగా ముగిసింది. ముఖ్యమైన పర్వదినాల వేళ ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్థించడం ఆనవాయితీగా వస్తోందని ఆయన సన్నిహితులు తెలిపారు.

# పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి, మీడియా మిత్రులకు పోలీస్ శాఖ తరఫున నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. 2026 నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు మరింత చేరువగా ఉండి, ప్రజలతో సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. అదేవిధంగా నేరాల నియంత్రణ, రోడ్డు భద్రత, మహిళలు మరియు పిల్లల రక్షణ, సైబర్ నేరాల నివారణ వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లాను శాంతియుతంగా నిలబెట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల సేవలో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

# జనవరి 1 నుంచి 31 వరకు పోలీసు యాక్ట్ అమలు

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

**వేద న్యూస్, మెదక్:**



మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జనవరి 01 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్,1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. ఈ కాలవ్యవధిలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే ప్రజల లేదా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ ఆంక్షలను గౌరవించి, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలి



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే
- భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు.. ఏర్పాట్ల పరిశీలన

**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం వేములవాడ భీమేశ్వర ఆలయాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తితో స్వాగతం పలకగా, ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, ఆర్డీఓ రాధాభాయ్‌లతో కలిసి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం అర్చకులు ప్రసాదం, ఆశీర్వచనం అందజేశారు.ఏర్పాట్లపై సమగ్ర పరిశీలన..సమ్మక్క-సారలమ్మ జాతర, మహాశివరాత్రి నేపథ్యంలో ఆలయంలో చేపడుతున్న ఏర్పాట్లను ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. తాగునీటి సరఫరా, ప్రసాదం కౌంటర్లు, పార్కింగ్ ఏరియా, టాయిలెట్లు, షవర్ స్నానాల ఏర్పాట్లు, కోడె మొక్కుల టికెట్ కౌంటర్, వీఐపీ-వీవీఐపీ, ప్రత్యేక దర్శనం క్యూలైన్లు, నీటి సరఫరా వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద నూతన భవనం స్లాబ్ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భీమేశ్వర, బద్ది పోచమ్మ ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ ఈఈ నరసింహాచారి, ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావుతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల సమస్యకు పరిష్కారం

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ప్రజలను ఇబ్బంది పెడు తున్న వీధి కుక్కల సమస్యకు సర్పంచ్ మామిడి రాజు పరిష్కారం చూపించారు. గ్రామస్తులు ఫిర్యాదు చేయగానే వెంటనే స్పందించిన ఆయన, వీధుల్లో తిరుగుతున్న కుక్కలను పట్టించి కుక్కల సంరక్షణ కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేశారు. కుక్కల వల్ల పిల్లలు, మహిళలు, వృద్ధులు భయపడుతున్నారని గ్రామ ప్రజలు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సర్పంచ్ ఈ చర్యలు చేపట్టడంతో గ్రామంలో ప్రజలకు ఊరట లభించింది.సర్పంచ్ తీసుకున్న నిర్ణయంపై గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, సమస్యకు పరిష్కారం చూపినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా సర్పంచ్ పనిచేస్తున్నారని వారు అన్నారు. ప్రజల భద్రతే తన లక్ష్యమని, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు ముందుకూ కొనసాగిస్తామని సర్పంచ్ మామిడి రాజు తెలిపారు

# జాతీయ స్థాయి ఎకనామిక్స్ అసోసియేషన్‌లో సురేష్ లాల్‌కు కీలక పదవి

- ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నిక
- తెలంగాణ నుంచి ఈ గౌరవం పొందిన తొలి కేయూ ఆచార్యుడు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్ :**



కాకతీయ యూనివర్సిటీ అర్థశాస్త్ర విభాగాధిపతి, పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్ ప్రతిష్టాత్మక ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ జాతీయ స్థాయి జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని వేల్స్ యూనివర్సిటీలో డిసెంబర్ 27 నుంచి 29 వరకు నిర్వహించిన ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ 108వ వార్షికోత్సవ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కేయూ నుంచి ఈ పదవిని పొందిన తొలి వ్యక్తిగా ఆచార్య సురేష్ లాల్ ఎంపిక కావడం గర్వకారణమని కేయూ జర్నలిజం, ఎడ్యుకేషన్ విభాగాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర అధ్యక్షుడు డా. సంగని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో ఆచార్య సురేష్ లాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సురేష్ లాల్ మాట్లాడుతూ.. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ అసోసియేషన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, నోబెల్ గ్రహీత అమర్త్య కుమార్ సేన్, రంగరాజన్ వంటి ప్రముఖులు ప్రాతినిధ్యం వహించారని గుర్తు చేశారు. 'వికసిత్ భారత్2047' లక్ష్యాలను సాధించేందుకు ఆర్థిక వ్యవస్థకు అవసరమైన విధానాల రూపకల్పనలో ఈ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డా. నల్లాని శ్రీనివాస్, డా. బ్రహ్మం, డా. వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా, రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన భద్రతా నియమాల పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల నుంచి వాహనదారుల వరకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని పిలుపునిచ్చారు. ఓవర్‌లోడ్ వాహనాలు నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని, వివిధ వాహనదారులతో ర్యాలీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. రోడ్లపై బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, వాటి నివారణకు ఆర్అండ్‌బీ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదకర మలుపుల వద్ద అవసరమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, ఏఎంవీఐలు రజనీదేవి, పృథ్వీరాజ్ వర్మతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గులాబీ గూడు వదిలి..!

**- కల్వకుంట్ల ఇంట్లో 'సొంత' పోరు - రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా కవిత అంశం**






- ☐ జిల్లాల్లో పర్యటిస్తూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పై ఘాటైన వ్యాఖ్యలు
- ☐ సొంత పార్టీ పెడితే నెగ్గుకు రాగలరా?
- ☐ తండ్రిని కాదని రాష్ట్ర ప్రజలు కూతురును స్వాగతిస్తారా?
- ☐ కలిసొచ్చేది ఎవరు? చెయ్యిచ్చేది ఎవరు?
- ☐ షర్మిలలా కాకూడదంటున్న అనుచరులు
- ☐ ఎక్కడికెళ్లినా ప్రజా సమస్యలపైనే పోరుబాట
- ☐ ఇప్పటికైతే బ్రహ్మరథం పడుతన్న ప్రజలు
- ☐ చివరిదాకా ఆదరణ ఉండేనా?!

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణ రాజకీయ యవనికపై మరో సంచలనానికి తెరలేవబోతోందా? ఉద్యమ కాలం నాటి 'జాగృతి' గళం.. ఇప్పుడు రాజకీయ 'క్రాంతి'గా మారబోతోందా? తన తండ్రి, అన్న నీడ నుంచి బయటకు వచ్చి.. కల్వకుంట్ల కవిత తనకంటూ ఒక ప్రత్యేక రాజకీయ అస్తిత్వాన్ని వెతుక్కుంటున్నారా? ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న చర్చల సారాంశం ఇదే. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత ఆసక్తికరంగా మారిన అంశం.. కల్వకుంట్ల కవిత రాజకీయ భవిష్యత్తు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తనయగా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా ఉద్యమ కాలం నుంచి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవిత.. ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నారా? అన్న చర్చ జోరుగా సాగుతోంది.

**- మొదటి నుంచి తండ్రి నీడలో..**

కవిత రాజకీయ గుర్తింపు ఆరంభం నుంచే తండ్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నీడలోనే సాగింది. తెలంగాణ ఉద్యమ కాలంలో సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల ద్వారా ఆమె జాగృతి వేదికగా మహిళలు, విద్యార్థులు, మేధావులతో అనుబంధం పెంచుకుంది. ఎంపీగా ఢిల్లీ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేసింది. అయితే, అధికార పార్టీ బీఆర్ఎస్‌లో కేంద్ర బిందువుగా మాత్రం ఆమె ఎదగలేకపోయిందన్న వాదన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కీలక నిర్ణయాల్లో తాను పక్కకు నెట్టబడుతున్నానన్న భావన ఆమె వ్యాఖ్యల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

**- తండ్రి దేవుడు అంటూ..**

కవితా ఇటీవల తన తండ్రి కేసీఆర్‌ను 'దేవుడు' అని అభివర్ణిస్తూనే, బీఆర్ఎస్ పార్టీలోని కొందరు ముఖ్య నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. అంతేకాదు జిల్లాల పర్యటనలో భాగంగా కవిత అనేక సంచలన వ్యాఖ్యలు కూడా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారిపై కూడా చాలా సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబంలో తలెత్తిన అంతర్గత విభేదాలు, ముఖ్యంగా అన్న కేటీఆర్‌తో ఉన్న గ్యాప్ ఇప్పుడు పార్టీ పరిధిని దాటి బయటకు వస్తున్నాయా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. పార్టీలో తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్న అసంతృప్తి ఆమె మాటల్లో ధ్వనిస్తోందనేది విశ్లేషకుల అభిప్రాయం.

**- కొత్త పార్టీ దిశగా అడుగులు?**

బీఆర్ఎస్ నుంచి విభేదించినప్పటి నుంచి కవిత కొత్త పార్టీ పెడతారనే సంకేతాలు వినిపిస్తున్నాయి. అంతర్గతంగా ఈ మేరకు కార్యాచరణ జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నా పైకి మాత్రం ఇప్పటికీ స్పష్టంగా ఈ విషయమై ఎవరూ ప్రకటించలేదు. ఒక వేళ నిజంగానే సొంతంగా పార్టీ పెడితే కవిత పరిస్థితి ఏమిటి? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. కాంగ్రెస్ బలంగా ఉన్న వేళ, బీఆర్ఎస్ తన పట్టు కోసం పోరాడుతున్న తరుణంలో.. కవిత మూడో ప్రత్యామ్నాయంగా నిలబడగలరా? అటు తండ్రి నిర్మించిన సామ్రాజ్యాన్ని కాదని, ఇటు కాంగ్రెస్ దూకుడును తట్టుకుని నిలబడటం మామూలు విషయం కాదు. తెలంగాణ సెంటిమెంట్, మహిళా ఓటు బ్యాంకు, జాగృతి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న



కేడర్ ఆమెకు ప్రధాన బలంగా ఉన్నా.. అప్పటి వరకు పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాలేమంటున్నారు నిపుణులు

**- మరో షర్మిల అవుతారా?**
**లేక పట్టు సాధిస్తారా?**

తెలంగాణలో వైఎస్ షర్మిల పార్టీ పెట్టినప్పుడు ఆరంభంలో సందడి కనిపించినా, చివరకు ఆమె తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయాల్సి వచ్చింది. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాగే ఉంటుందా అన్న సందేహాలు వస్తున్నాయి. కానీ, షర్మిలకు లేని అడ్వాంటేజ్ కవితకు ఉంది. ఆమెకు ఈ నేల మీద అవగాహన ఉంది, ఇక్కడి భాష, యాస, ఉద్యమ మూలాలు ఉన్నాయి. అయితే, షర్మిల అనుభవం నుంచి పాఠాలు నేర్చుకుని, భిన్న వ్యూహాలతో ముందుకెళ్తేనే కవితకు అవకాశం ఉందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ఒకవేళ కవిత 'వన్ మెన్ ఆర్మీ'గా బరిలోకి దిగితే.. ఆమె వెంట నడిచే పెద్ద నేతలు ఎవరు? ఇతర పార్టీల నుంచి అసంతృప్త నేతలు ఆమె గూటికి చేరుతారా? అన్నది వేచి చూడాలి.

**- యాత్రల వెనుక అసలు వ్యూహం**

ఇటీవల కవిత చేస్తున్న జిల్లా పర్యటనలు, మహిళా సమావేశాలు, మేధావులతో చర్చలు.. ఇవన్నీ ఒకే దిశగా సాగుతున్నట్లు కనిపిస్తున్నాయి. కవిత పర్యటనలలో భాగంగా ఆమె ఎక్కడికి వెళ్లినా జనం బ్రహ్మరథం పడుతున్నారు. ఇది కేవలం సానుభూతా? లేక నాయకత్వ మార్పును కోరుకుంటున్న జనం ఇస్తున్న సంకేతమా అనేది ఇప్పుడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అంటే ఒక ఎమోషన్. ఆ ఎమోషన్‌ను కవిత ఎలా ఓన్ చేసుకుంటారు? తండ్రి వారసత్వాన్ని మోస్తూనే, సొంత ముద్ర వేయడం కవితకు కత్తి మీద సామే. మొత్తంగా కేసీఆర్‌ను కాదని కవితను తెలంగాణ ప్రజలు యాక్సెప్ట్ చేస్తారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏది ఏమైనా కవిత పర్యటనలు తక్షణ ఎన్నికల లక్ష్యంతో కాకుండా, దీర్ఘకాలిక ఇమేజ్ బిల్డింగ్ కోసం కావచ్చని అంచనా వేస్తున్నారు.

**- కలిసొచ్చేది ఎవరు? చెయ్యిచ్చేది ఎవరు?**

కవిత కొత్త పార్టీ పెడితే బీఆర్ఎస్‌లోని రెండో శ్రేణి నాయకత్వం కవిత వైపు చూసే అవకాశం ఉంది. అయితే, కీలక నేతలు కేసీఆర్, కేటీఆర్‌లను వదిలి ఆమె వెంట నడుస్తారా అనేది సందేహమే. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు. కవిత వేసే ప్రతి అడుగు ఆమె రాజకీయ భవిష్యత్తును నిర్ణయించబోతోంది. ఏది ఏమైనా ఆమె వెంట ప్రస్తుతం కొంత మంది కార్యకర్తలు, చిన్నాచితక నేతలు మాత్రమే నడుస్తున్నారు తప్ప.. పెద్ద నేతలు మాత్రం బయట కనపడడం లేదు. ఒకవేళ అప్పటికి పరిస్థితిని బట్టి ఏమైనా మార్పు ఉండొచ్చంటున్నారు రాజకీయ విశ్లేషకులు

## ఏఐ దేశ ఆర్థిక భవిష్యత్తునునిర్ణయిస్తుంది

ఫర్ బిగినర్స్' మాడ్యూల్‌లో పాల్గొని, 'స్కిల్ ది నేషన్' చాలెంజ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికత దేశ అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరుస్తోందని తెలిపారు. రాబోయే కాలంలో ఏఐ దేశ ఆర్థిక వ్యవస్థకు ఇంజిన్‌లా మారుతుందని, కొత్త నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సాంకేతిక పురోగతి మానవ విలువలతో కలిసినప్పుడే సమాజానికి నిజమైన మేలు జరుగుతుందని పేర్కొన్నారు. అదే కార్యక్రమంలో భాగంగా, ఒడిశాలోని రైరంగ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ జాతీయ ఓపెన్ విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రం, నైపుణ్య కేంద్రాన్ని రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేంద్రాలు విద్యార్థులు, యువతకు నైపుణ్యాభివృద్ధిలో కీలకంగా మారనున్నాయని ఆమె తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన రాష్ట్రపతి, సాంకేతికత, జ్ఞానం, నైపుణ్యాలను కేవలం వ్యక్తిగత లాభాల కోసం కాకుండా సమాజ సేవకు వినియోగించాలని పిలుపునిచ్చారు. సమాజ సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో, ఇతరులను శక్తివంతం చేయడంలో యువత ముందుండాలని సూచించారు. జ్ఞానం సామాజిక బాధ్యతతో కూడినప్పుడు దేశం మరింత బలంగా ఎదుగుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.

## జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు 2026 ప్రారంభం



వాహనదారులు హెల్మెట్ తప్ప నిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిం చాల్సిందేనని సూచిం చారు .రోడ్డు భద్రతా మాసో త్సవాల్లో భాగంగా అధికా రులకు స్వయంగా హెల్మెట్లు బహుకరిం చారు. అలాగే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్, వాహ నాల స్టిక్కర్లు, విద్యార్థుల కోసం రూపొందించిన తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనతో పాటు జేటీసీలు, డీటీసీలు, ఆర్టీఏ సభ్యులు నవీన్, సురేష్ లాల్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అవగాహన పుస్తకాలను మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో రోడ్డు భద్రతపై బాధ్యతాయుత ఆలోచన పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రజల జీవితాల్లో మార్పు లేదు

నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

**పదేళ్ల పాలన చెరగని చరిత్ర**

తెలంగాణ ఉద్యమాన్ని స్మరించుకున్న కేటీఆర్, కేంద్రంతోనూ సమైక్య వాదులతోనూ కేసీఆర్ నాయకత్వంలో 14 ఏళ్ల పాటు సాగిన పోరాటాన్ని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు జరిగిన అభివృద్ధి, సంక్షేమం చరిత్రలో చెరగని ముద్రగా నిలిచిందని, ఆ ప్రగతి సంతకాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు.

**పార్టీకి అసలైన బలం కార్యకర్తలే..**

గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ కొనియాడారు. జెండాను చేతబట్టి నడిపించే నాయకులకంటే, ఆ జెండాను భూమిలో నిటారుగా పాతి "ఇది నా జెండా" అని గర్వంగా చెప్పే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ప్రతి పోరాటంలో ముందుండి నడిపించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రతి అన్యాయానికి ఎదురు నిలిచిన ప్రజలు**

లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడులకు వ్యతిరేకంగా, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన తీరుపై, రైతుబంధును రెండుసార్లు ఎగ్గొట్టిన అన్యాయంపై, ఆరు గ్యారంటీలు420 హామీలపై ప్రజా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన కార్యకర్తలను కేటీఆర్ ప్రశంసించారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న దాష్టీకానికి వ్యతిరేకంగా గళమెత్తిన వారిని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అంశంలో నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా స్మరించారు.

**2028 లక్ష్యం..**

2026లోకి అడుగుపెడుతున్న ఈ శుభసందర్భంలో గెలుపులు, ఓటములు శాశ్వతం కాదని, అవి తాత్కాలికమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం, గులాబీ జెండా స్థానం మాత్రం శాశ్వతమని స్పష్టం చేశారు. ఇతర పార్టీలకు రాజకీయాలు ఆటలాంటివైతే, తెలంగాణ సాధించిన బీఆర్ఎస్‌కు రాజకీయాలు ప్రజల సంక్షేమానికి సంబంధించిన ధర్మమని, ఒక విధి అని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఒకవైపు పోరాటాన్ని కొనసాగిస్తూనే, మరోవైపు పటిష్టమైన సంస్థాగత నిర్మాణంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడటమే బీఆర్ఎస్ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

# రూ.1.23 కోట్లు కొట్టేశారు !



**వేద న్యూస్, అద్దంకి:**

డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాదు, విద్యావంతులను కూడా బురిడీ కొట్టిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లా అద్దంకిలో రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని బెదిరించి ఏకంగా రూ. 1.23 కోట్లను కాజేసిన ఘరానా మోసం వెలుగుచూసింది. ఈ ఘటన స్థానికం గా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణానికి చెందిన శ్రీరామ్ నాగేశ్వరరావు గతంలో ఐడీబీఐ బ్యాంక్‌లో లోన్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేశారు. కొద్ది రోజుల క్రితం తనకు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, విధుల్లో ఉన్న సమయంలో అక్రమాలు జరిగాయని, దీనిపై కేసు నమోదైందని చెప్పారు. తాను, తన భార్యను వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తూ డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు గురిచేశారు. కేసు నుంచి తప్పించుకోవాలంటే డబ్బులు చెల్లించాలని నమ్మించి, విడతల వారీగా రూ. 1.23 కోట్లను వివిధ అకౌంట్లకు బదిలీ చేయించారు. సైబర్ నేరగాళ్ల బెదిరింపులు అత్యంత దారుణంగా ఉన్నాయని బాధితుడు పోలీసులకు తెలిపాడు. ఆధార్ వివరాలతో కెనరా బ్యాంక్ డూప్లికేట్ ఖాతా తెరిచామని చెబుతూ వాట్సాప్‌లో పత్రాలు పంపారు. నగదు హవాలా చేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తూ, వీడియో కాల్ ద్వారా ఇంటి శోధన పేరుతో బీరువాలో ఉన్న షేర్ మార్కెట్ పత్రాలు కూడా చూపించాలని ఒత్తిడి చేశారు. ఇంట్లో ఉన్న బంగారం, మోసపోయానని గ్రహించిన ఆయన ముందుగా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం ఇచ్చి, వారి సూచన మేరకు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇల్లు కూడా అమ్మి డబ్బులు చెల్లించాలని నేరగాళ్లు డిమాండ్ చేయగా, తాను పోలీసులను ఆశ్రయిస్తానని చెప్పడంతో ఫిజికల్ అరెస్ట్ చేస్తామని బెదిరించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సుబ్బరాజు తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అనే పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులు లేదా ప్రభుత్వ సంస్థలు ఎప్పుడూ ఫోన్ ద్వారా అరెస్ట్ చేస్తామని బెదిరించరని స్పష్టం చేశారు. ఇలాంటి కాల్స్ వస్తే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు

వేద న్యూస్

శుక్రవారం జనవరి 02, 2026

# టీజీఐసీసీసీలో నూతన సంవత్సర వేడుకలు




- సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసిన నగర సీపీ సజ్జనార్
- సేవాభావంతో పని చేయాలని పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కేక్ కట్ చేసి మినిస్టీరియల్ స్టాఫ్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరం అందరికీ ఆరోగ్యం, ఆనందం, విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) కె. వెంకట లక్ష్మి, సీఏడీవో శైలజ, సీఏఓ శ్రీనివాస్, జేఏవో ఉమాకాంత్, మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యాలయ సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణంలో వేడుకలు కొనసాగాయి. ఈ సందర్భంగా నగర సీపీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ప్రతి ఉద్యోగి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కొత్త సంవత్సరంలో మరింత ఉత్సాహంతో, సమన్వయంతో పని చేసి శాఖ ప్రతిష్ఠను పెంచాలని సిబ్బందికి ఆయన పిలుపునిచ్చారు.

# బాల సదన్‌లో నూతన సంవత్సర వేడుకలు

**వేద న్యూస్, మెదక్ :**



- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

మెదక్ పట్టణంలోని బాల సదన్‌లో పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలను మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ముచ్చటించిన జిల్లా ఎస్పీ వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో వారు సాధించాలనుకునే లక్ష్యాలపై చర్చిస్తూ, మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, కష్టపడి చదివే అలవాటు ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పిల్లలకు ప్రోత్సాహం అందించారు. పిల్లల భవిష్యత్తే సమాజ భవిష్యత్తు అని పేర్కొన్న ఎస్పీ, వారు మంచి పౌరులుగా ఎదగాలంటే విద్యే ప్రధాన ఆయుధమని తెలిపారు. నూతన సంవత్సరంలో పిల్లలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండి చదువులో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, రంగా నాయక్, సీఐలు మహేష్, శ్రీకృష్ణమూర్తి, శైలేందర్, బాల సాధన్ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంత అక్రమ సంపాదనా!



- ఒడిశాలో రెవెన్యూ అధికారి ఇంట్లో విజిలెన్స్ దాడులు
- అత్త ఇంట్లో 75 లక్షల నగదు స్వాధీనం
- మొత్తం 82 లక్షల నగదు, బంగారం, స్థిరాస్తులు సీజ్
- భువనేశ్వర్‌లో ట్రిపుల్ స్టోరీ భవనాలు, ఖరీదైన ప్లాట్లు గుర్తింపు

**వేద న్యూస్, భువనేశ్వర్ ప్రతినిధి :**








ఒడిశాలో అవినీతి నిరోధకశాఖ భారీగా నగదు స్వాధీనం చేసుకుంది. అదనపు రెవెన్యూ అధికారి జితేంద్ర కుమార్ పండాకు సంబంధించిన అత్త ఇంట్లో నుంచి విజిలెన్స్ అధికారులు రూ.75 లక్షల నగదును రికవరీ చేశారు. ఈ ఘటన కటక్ జిల్లాలోని బరాంగ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. తాళం వేసి ఉన్న ఇంటిని తెరిపించి అధికారులు సోదాలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, పండాకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మొత్తం రూ.82 లక్షల నగదుతో పాటు బంగారం, విలువైన స్థిరాస్తులను సీజ్ చేశారు. రెవెన్యూ అధికారి పండా ఇంట్లోనే ఆయన అత్త నివసిస్తుండగా, అక్కడ భారీగా నగదు దొరకడం సంచలనంగా మారింది. స్వాధీనం చేసిన నగదును ఇంకా పూర్తిగా లెక్కిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సోదాల్లో భాగంగా జితేంద్ర కుమార్ పండాకు అనేక స్థిరాస్తులు ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది. భువనేశ్వర్ నగరంలో మూడు ట్రిపుల్ స్టోరీ భవనాలు, రెండు బీహెచ్‌కే ఫ్లాట్లు ఉన్నట్లు తేలింది. అదేవిధంగా ఖోర్ధా జిల్లాలో ఒక డబుల్ స్టోరీ భవనం కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా భువనేశ్వర్‌లోని అత్యంత సంపన్న ప్రాంతాల్లో నాలుగు ఖరీదైన ప్లాట్లు కూడా ఆయన పేరిట ఉన్నట్లు వెల్లడైంది. మరో ప్రాంతంలో నిర్వహించిన సోదాల్లో అదనంగా రూ.7 లక్షల నగదు, వంద గ్రాముల బంగారాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన లాకర్ వివరాలను కూడా సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఆదాయానికి మించిన ఆస్తులపై దర్యాప్తు కొనసాగుతోందని ఒడిశా విజిలెన్స్ శాఖ స్పష్టం చేసింది.

# పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

- ఎస్పీ మహేష్ బి. గితే

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**



జిల్లా పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీస్ యాక్ట్-1861 ప్రకారం జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ కాలవ్యవధిలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించరాదని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రభుత్వ లేదా ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని, శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహుకరించిన కేటీఆర్

- బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ విద్యార్థిని ప్రణయకు చేయూత
- ఇప్పటివరకు 36 మంది విద్యార్థులకు విద్యా సహాయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**




నూతన సంవత్సరాన్ని విద్య, సేవతో ప్రారంభిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన మానవీయతను చాటుకున్నారు. బీవీఆర్ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్న ప్రతిభావంతురాలైన ప్రణయకు ఆయన స్వహస్తాలతో ల్యాప్‌టాప్‌ను బహుకరించారు. విద్యార్థులకు అవసరమైన సాంకేతిక వసతులు అందిస్తే వారి భవిష్యత్తు మరింత వెలుగులు నింపుతుందన్న విశ్వాసంతో ఈ సహాయం అందించినట్లు కేటీఆర్ తెలిపారు. ప్రణయ, కేటీఆర్‌కు అత్యంత నిబద్ధతతో పనిచేసే కేటీఆర్ సైనికుడు శ్రీనివాస్ రెడ్డి కుమార్తె. చదువులో ప్రతిభ చూపుతున్న ఆమెకు ల్యాప్‌టాప్ అందించడం ద్వారా ఉన్నత విద్యలో మరింత ముందుకు వెళ్లేందుకు ఈ సహాయం దోహదపడుతుందని కేటీఆర్ ఆకాంక్షించారు. విద్యే సమాజాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థుల విద్యాభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని, ఇప్పటివరకు 36 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహుకరించే అవకాశం కలిగిందని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తానని, ప్రతిభకు కొదవ ఉండకూడదన్నదే తన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

# గింత నిర్లక్ష్యమా?




- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా ప్రాణాల మీదకు వస్తున్నా పట్టింపు లేదా?
- మెదక్‌సిద్దిపేట జాతీయ రహదారిపై అధికారుల నిర్లక్ష్యం
- బిజెపి మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆవేదన

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఎల్కతుర్తి మీదుగా వెళ్లే మెదక్ సిద్దిపేట జాతీయ రహదారి గత కొద్ది నెలలుగా అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రహదారి విస్తరణ మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో.. నడిరోడ్డుపై కంకర విస్తరించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రోడ్డు పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ..ద్విచక్ర వాహనాలు ,ఆటోలు , కార్లు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయని ఇప్పటికే పలువురు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో సరైన సూచిక బోర్డులు, హెచ్చరికలు లేకపోవడం వల్ల ప్రమాదాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ..సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు పనులపై పర్యవేక్షణ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో మరిన్ని ప్రాణనష్టాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే రోడ్డు పనులను వేగవంతం చేసి నడిరోడ్డుపై ఉన్న కంకరను తొలగించి. .ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# మునిసిపాలిటీ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల


**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల మునిసిపాలిటీ పరిధిలోని ఓటర్ల ముసాయిదా డ్రాఫ్ట్ జాబితాను మున్సిపల్ అధి,కారులు విడుదల చేశారు. పోలింగ్ స్టేషన్ల వారీగా సిద్ధం చేసిన ఈ జాబితాలను ప్రజల పరిశీలన కోసం మునిసిపల్ కార్యాలయ నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. మునిసిపాలిటీ పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య 81,959 గా నమోదైంది. ఇందులో పురుషులు 39,942 మంది కాగా, మహిళా ఓటర్లు 42,011 మంది ఉన్నారు. ఇతరులు 06 మందిగా నమోదయ్యారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఇక్కడ అధికంగా ఉండటం విశేషం. ప్రచురించిన ఈ జాబితాలలో ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నా, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా లేదా అనర్హుల పేర్ల తొలగింపు కోరాలన్నా తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దిష్ట గడువులోపు మునిసిపల్ కార్యాలయంలో అభ్యంతరాలు లేదా కొత్త దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని మునిసిపల్ అధికారులు కోరుతున్నారు.

# 'అమృత' ఆస్పత్రిలో బెస్ట్ ట్రీట్‌మెంట్

- 27/7 అందుబాటులో న్యూరో ఫిజీషియన్
- చక్కటి వైద్యసేవలందిస్తున్న డాక్టర్ కందికొండ రాజేందర్



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని అమృత న్యూరో ఆస్పత్రిలో డాక్టర్ కందికొండ రాజేందర్ ఎంబీబీఎస్, ఎండీ, డీఎం న్యూరాలజీ(గోల్డ్ మెడలిస్ట్) చక్కటి వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని చెప్పొచ్చు. రోగి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఓ పేషెంట్(పేరు గోప్యం) గత పదేండ్ల నుంచి అనారోగ్యం విషయమై వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూనే తిరుగుతోంది. సదరు పేషెంట్‌కు ఉన్న డిసీజ్ ఐడెంటిఫై చేయడంలో ప్రతీసారి వైద్యులు విఫలం అవుతూనే ఉన్నారు. ఇటీవల సదరు రోగి అమృత న్యూరో ఆస్పత్రికి వచ్చారు. కన్సల్టేషన్‌లో భాగంగా వచ్చిన ఆ పేషెంట్‌ను చూసిన డాక్టర్ కందికొండ రాజేందర్.. రోగికి ప్రతీ సారి జ్వరం, లంగ్ ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల.. ఆక్సిజన్ అందించడం జరుగుతోందని తెలుసుకున్నారు. అసలు పేషెంట్ సమస్య ఏంటో తెలుసుకునేందుకు డాక్టర్ రాజేందర్.. కొంచెం టైం తీసుకుని.. కేర్ ఫుల్ ఎగ్జామినేషన్ చేశారు. సదరు పేషెంట్‌కున్యూరో మస్కులర్ డిసీజ్ ఉందని గుర్తించారు. టెస్టులకు నిమ్స్ ఆస్పత్రి హైదరాబాద్‌కు.. పంపించారు. అక్కడ టెస్టులలో పాజిటివ్ వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె దాదాపుగా 50 శాతానికపైనే రికవరీ అయ్యారు. త్వరలో ఆమె పూర్తిస్థాయిలో రికవరీ అవుతారని డాక్టర్ రాజేందర్ వెల్లడించారు.

**డాక్టర్ రాజేందర్‌కు రోగి కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు**

పేషెంట్‌కు సంబంధించిన డిసీజ్‌పై డీటెయిల్డ్‌గా స్టడీ చేసి..నిమ్స్‌కు రెఫర్ చేసి.. చక్కటి వైద్యం అందేలా అమృత న్యూరో ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రాజేందర్ సూచించారని, ఆయన లాంటి వైద్యులు.. ఉంటే ప్రతీ ఒక్కరి జీవితం సంతోషంగా ఉంటుందని పేషెంట్ బంధువు వెల్లడించారు. అమృత ఆస్పత్రి వారికి, డాక్టర్ రాజేందర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# బొకేలు వద్దు.. బ్లాంకెట్లు ఇవ్వండి



- నూతన సంవత్సరంలో మానవత్వమే గొప్ప కానుక
- చలిలో పేదలకు రక్షణగా దుప్పట్లు ఉపయోగపడతాయి
- మంత్రి సీతక్క పిలుపు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

నూతన సంవత్సరాన్ని ఆర్భాటాలతో కాకుండా మానవత్వంతో ప్రారంభించాలని రాష్ట్ర మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. సచివాలయంలో ఎస్ఈఆర్పీ సీఈవో దివ్య దేవరాజన్ ఆధ్వర్యంలో ఎస్ఈఆర్పీ డైరెక్టర్లు, సిబ్బంది మంత్రి సీతక్కను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూల బొకేలకు బదులుగా తెలంగాణ నేతన్నలు తయారు చేసిన దుప్పటిని ఆమెకు అందజేశారు. ఈ ఆలోచనను మంత్రి హర్షిస్తూ, మానవీయ విలువలకు ఇది చక్కటి ఉదాహరణగా పేర్కొన్నారు. ఎస్ఈఆర్పీ డైరెక్టర్లు, సిబ్బందిని అభినందించిన మంత్రి, తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఈఆర్పీ విభాగం ద్వారా పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. బొకేలు క్షణాల్లో వాడుక లేకుండా పోతే, ఒక దుప్పటి మాత్రం చలిలో వణికే పేద విద్యార్థులు, పిల్లలు, వృద్ధులు, కూలీలకు నిజమైన రక్షణగా నిలుస్తుందని ఆమె స్పష్టం చేశారు. "బొకేలు వద్దుడ బ్లాంకెట్లు ఇవ్వండి" అంటూ అందరూ ఈ ఆలోచనను ఆచరణలో పెట్టాలని కోరారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రికి తెలియజేయగా ఆయన కూడా సంతోషం వ్యక్తం చేశారని మంత్రి సీతక్క వెల్లడించారు. సచివాలయం ముందు శాలువలు, దుప్పట్లు సులభంగా లభించేలా టెస్కో ద్వారా ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. పేదల చిరునవ్వే నిజమైన నూతన సంవత్సర శుభాకాంక్ష అని, చిన్న సహాయం కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందని మంత్రి సీతక్క అన్నారు.

# మొదటి వేతనాన్ని పాఠశాల విద్యార్థుల కోసం కేటాయిస్తాం

**వేద న్యూస్, కాసిపేట:**



- సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్య

తన మొదటి వేతనాన్ని పాఠశాల విద్యార్థుల అవసరాల కోసం కేటాయిస్తామని కోమటిచేను గ్రామ సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్య తెలిపారు. కాసిపేట మండలం కోమటిచేను గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్యను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సర్పంచ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు బోరు నీరు తాగుతున్న విషయాన్ని ఉపాధ్యాయులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్, తన మొదటి వేతనంతో పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, పాఠశాల బలోపేతమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ గుమ్మడి శంకర్, దుర్గం సురేష్, దాసరి మల్లేష్, దుర్గం గణేష్, యువజన విభాగం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ ఆధ్వర్యంలో

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని కొత్త పల్లి లో స్పందన అనాథ ఆశ్రమంలో పిల్లలతో కలిసి ప్రతి ఏడాది లాగానే ఈ సంవత్సరం కూడా నూతన సంవత్సర వేడుకలు జరుపుకునట్టు సామాజిక కార్యకర్త అంబాల రజనీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మా ట్లాడుతూ.. ప్రతి సంవత్సరం స్పందన అనాథ ఆశ్రమంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని. .పిల్లలందరికీ కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్టు , బెడ్స్, ఫ్రూట్పంస్ పిణీ చేసి పిల్లలకు అన్నదానం చేసినట్టు వెల్లడించారు. జక్కే ప్రతాప్ జన్మ దిన వేడుకలను కూడా సెలెబ్రేట్ చేశారు. కార్యక్రమంలో అంబాల సదానంద, జక్కే ప్రతాప్, శ్రీనివాస్ దొడ్డ రాజు వొళ్ళల శ్రీకాంత్ మిడిదొడ్డి సాయిరాం జూకంటి కమల్ రాకేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ సేన ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

- నూతన సంవత్సరం సందర్భంగా..

**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ అయినవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం పరిధిలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రసూచనల మేరకు నూతన సంవత్సరం సందర్భంగా కేటీఆర్ సేన ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి ఏటా నూతన సంవత్సరం సందర్భంగా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టాలనే ఉద్దేశంతో, కేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మింట్ రెడ్డి అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది కూడా అయినవోలు మల్లికార్జున స్వామి ప్రాంగణంలో అయినవోలు గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన గడ్డం రఘు వంశీ గౌడ్ సహకారంతో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైనాల నరేష్ మాట్లాడుతూ..తెలంగాణ యువత డిసెంబర్ 31 వేడుకలను దూరంగా ఉండి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, అనవసర దావతులను మానుకొని, సమాజానికి దాతలుగా మారాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోకేటీఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు మైనాల నరేష్,జిల్లా ప్రధాన కార్యదర్శి మింట్ రెడ్డి



అశోక్,అయినవోలు గ్రామ సర్పంచ్ గడ్డం రఘు వంశీ గౌడ్,కేటీఆర్ సేన వర్ధన్నపేట ఇన్‌చార్జ్ చిర్రా సుమన్,మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు తరుణ్, ప్రముఖ వ్యాపారవేత్త మైనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్లో చేరిన సర్పంచ్

**వేద న్యూస్, చొప్పదండి గంగాధర:**



తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన సర్పంచులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర మండలం మల్లాపూర్ గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ కొలెపాక కవితా మల్లేశం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కరీంనగర్ లోని తన నివాసంలో సర్పంచ్ కవిత మల్లేశంకు ఎమ్మెల్యే కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గం లోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.

# కాసిపేట-1 ఇంక్లైన్ ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాల పంపిణీ

**వేద న్యూస్, కాసిపేట:**




కాసిపేట-1 ఇంక్లైన్‌లో పనిచేస్తున్న 30 మంది అండర్‌గ్రౌండ్ ఉద్యోగులకు బుధవారం ఉదయం రెగ్యులర్ పదోన్నతి పత్రాలను ఘనంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట-1 ఇంక్లైన్ మేనేజర్ సతీష్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ చేతుల మీదుగా ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలు అందజేశారు. ఏడు సంవత్సరాల సేవా కాలం పూర్తి చేసుకున్న అండర్‌గ్రౌండ్ ఉద్యోగులకు యాజమాన్యం వివిధ కేటగిరీల్లో రెగ్యులర్ పదోన్నతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా మేనేజర్ సతీష్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రక్షణ అధికారి రవీంద్ర నిఖిల్, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, బుక్య సుమన్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీ నారాయణలు ఉద్యోగులకు ప్రమోషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మీర్జా గౌస్ జీషాన్, సర్వేయర్ ప్రభాకర్, బన్న లక్ష్మన్ దాస్, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేందర్‌తో పాటు లింగయ్య, రవి, అనిల్, శ్రీనివాస్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కార్మికుల కృషికి గుర్తింపుగా పదోన్నతులు లభించడం ఆనందకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉంటుందని తెలిపారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనలో లాయక్ పాషా

- భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం నిరంతరం పోరాటం సాగిస్తున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే -143) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాషా విశేష సేవలతో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. జర్నలిస్టులపై దాడులు, వేధింపులు జరిగిన సందరాల్లో వెంటనే స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా అధికారులతో సమన్వయం చేస్తూ ముందుండి పోరాడుతున్నారు. అలాగే అక్రిడిటేషన్ కార్డులు, బీమా, సంక్షేమ పథకాలు వంటి అంశాలపై ప్రభుత్వదృష్టికి సమస్యలను తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వారికి రక్షణతో పాటు గౌరవం లభించేలా కృషి చేయడం ఆయన సేవల్లో ప్రధానంగా నిలుస్తోంది. జర్నలిజం వ ృత్తి విలు వలు, నైతికతను కాపాడుతూ యువ జర్నలిస్టులకు మార్గ నిర్దేశం చేయడంలోనూ లాయక్ పాషా ముందుంటు న్నారు. ఆయన నాయకత్వంలో జిల్లా జర్నలిస్టు సంఘం మరింత బలోపేతమైందని సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయ పడుతున్నారు. జర్నలిస్టుల ఐక్యతే లక్ష్యంగా, సమ స్యల పరిష్కారమే దిశగా అంకితభావంతో సాగుతున్న లాయక్ పాషా సేవలు రానున్న రోజుల్లో మరింత మందికి ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా జర్నలిస్టులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# పిల్లలకు విషం ఇచ్చి తల్లి ఆత్మహత్య

- కూతురు మృతి..ఆసుపత్రిలో కుమారుడు

**నాగర్ కర్నూల్ వేద న్యూస్ :**

జిల్లా కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బుక్ సెంటర్ నిర్వహిస్తున్న భీంశెట్టి ప్రకాష్ (47) గత నెల రోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. భర్త మృతిని తట్టుకోలేక భార్య భీంశెట్టి ప్రసన్న (38) గురువారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లలు కూతురు మేఘన (13) కుమారుడు అశ్రీత్ రాం (15) కు అన్నంలో విషం కలిపి పిల్లలకు తినిపించి ఆమె కూడా తిన్నది.ప్రసన్న సోదరుడు ఇంటికి వచ్చి తలుపులు తీసి చూడగా ముగ్గురు అచేతన స్థితిలో పడి గమనించి హుటాహుటినా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తల్లి, కూతురు మృతి చెందారు. కుమారుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తల్లీ కొడుకును ఢీకొట్టిన కారు




- తల్లి మృతి.. కొడుకుకు గాయాలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

బైక్‌పై వెళ్తున్న తల్లీ, కొడుకును కారు ఢీకొట్టిన సంఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన తాళ్లపల్లి లక్ష్మీ (61), తాళ్లపల్లి సిరోజ్, ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండకు వచ్చి తిరిగి వెళ్ళే క్రమంలో అమ్మక్కపేట బస్టాండ్ క్రాసింగ్ వద్ద కారు ఢీకొట్టింది. మెట్‌పల్లి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మంతెన రమేష్ కారును అదే గ్రామానికి చెందిన కొడిచెర్ల మధు అనే వ్యక్తి అతివేగంగా వచ్చి బైక్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో బాధితులను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తల్లి లక్ష్మీ మరణించగా, కొడుకు సిరోజ్‌ను మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మ ృతురాలి భర్త తాళ్లపల్లి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

# కీర్తి మాత్రమే శాశ్వతం

- ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, జమ్మికుంట:**



లోకంలో మనిషికి సంబంధించి.. శాశ్వతంగా నిలిచేది తాను చేసిన ధర్మం సంపాదించిన కీర్తి మాత్రమేనని ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ చిట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సామాజిక జీవనానికి మూల సూత్రం తనవంతు బాధ్యతగా కర్మలను నిర్వర్తిస్తూ జీవించడమని, అది మనిషి కోరుకోవాలని పేర్కొన్నారు. జీవితకాలం అనేది అశాశ్వతమని స్పష్టం చేశారు. మనిషి మనుగడపై కాళిదాసు తెలిపిన విషయాలే ఇవీ అని శ్రీనివాసరెడ్డి చెప్పారు. శిశువుగా జ్ఞానన సంపాదనకు సమయం వెచ్చించాలని, యవ్వనంలో జ్ఞానం ద్వారా జీవికను సాధించాలని, ముసలితనంలో ముని వృత్తితో జీవిస్తూ మోక్ష సాధనకు ప్రయాణం కొనసాగించాలన్నారు.

వేద న్యూస్



## సైన్స్ ఫిక్షన్ దినోత్సవం

# నేటి ఊహలే రేపటి ప్రపంచానికి పునాది

**వేద న్యూస్ డెస్క్:**

సైన్స్ ఫిక్షన్ అనగానే చాలామందికి అది కల్పిత ప్రపంచం, అసాధ్యమైన కథలు, వాస్తవానికి దూరమైన ఊహలుగా మాత్రమే అనిపిస్తుంది. కానీ నిజానికి సైన్స్ ఫిక్షన్ అనేది మానవ జ్ఞాన వికాసానికి దారి చూపిన శక్తివంతమైన ఆలోచనా ప్రవాహం. భవిష్యత్ శాస్త్రం, సాంకేతికత, అంతరిక్షం, మానవ జీవన విధానాలపై ముందస్తు ప్రశ్నలు వేస్తూ, సమాజాన్ని ఆలోచింపజేసే వేదికే సైన్స్ ఫిక్షన్. అలాంటి సైన్స్ ఫిక్షన్‌కు అంకితమైన ఈ దినం మన ఊహాశక్తి విలువను మరోసారి గుర్తు చేస్తుంది. ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే, నేడు మనం సహజంగా వాడుతున్న అనేక సాంకేతిక సాధనాలు ఒకనాడు సైన్స్ ఫిక్షన్ కథలలో మాత్రమే ఉన్నాయి.

మనుషులు అంతరిక్షంలోకి వెళ్లడం, భూమికి బయట జీవం ఉండే అవకాశాలు, చేతిలో ఉన్న పరికరాలతో ప్రపంచంతో మాట్లాడటం, యంత్రాలు మనిషి ఆలోచనలను అర్థం చేసుకోవడం ఇవన్నీ ఒకప్పుడు కలలుగా కనిపించాయి. కానీ ఆ కలలను ఊహించిన రచయితలు, ఆలోచించిన మేధావులే రేపటి శాస్త్రవేత్తలకు మార్గదర్శకులయ్యారు. ఊహించడమే ఆవిష్కరణకు తొలి మెట్టు అనే సత్యాన్ని సైన్స్ ఫిక్షన్ పదే పదే నిరూపించింది. సైన్స్ ఫిక్షన్ రచనలు, సినిమాలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదు. అవి సమాజానికి అద్దంలాంటివి. రాబోయే కాలంలో మానవ సమాజం ఎటు వెళు ,ంది?

సాంకేతిక పురోగతి మనిషిని శక్తివంతం చేస్తుందా, లేక బలహీనపరుస్తుందా? యంత్రాలపై అధిక ఆధారపడటం మానవ సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎలా ఉంటుంది? వంటి ప్రశ్నలను సైన్స్ ఫిక్షన్ మన ముందుంచుతుంది. సమాధానాలు ఇవ్వకపోయినా, ఆలోచించాల్సిన బాధ్యతను మన మీద వేస్తుంది. ప్రత్యేకంగా యువతకు సైన్స్ ఫిక్షన్ ఒక శక్తివంతమైన ప్రేరణ. పాఠ్యపుస్తకాల్లోని సూత్రాలు ఒక వైపు ఉంటే, వాటిని జీవితంతో అనుసంధానించి చూపించే పని సైన్స్ ఫిక్షన్ చేస్తుంది.

"ఇలా అయితే ఎలా ఉంటుంది?" అనే ప్రశ్నతో మొదలయ్యే ప్రయాణమే శాస్త్రీయ దృష్టిని పెంపొందిస్తుంది. ఈ ప్రశ్నల నుంచే రేపటి ఇంజినీర్, శాస్త్రవేత్త, పరిశోధకుడు పుడతాడు. ఒక కథ చదివి, ఒక సినిమా చూసి, ఒక ఆలోచనతో ప్రేరణ పొందిన యువకుడు భవిష్యత్తులో ప్రపంచాన్ని మార్చే ఆవిష్కరణకు శ్రీకారం చుట్టే అవకాశం ఉంది. అయితే, సైన్స్ ఫిక్షన్ మనకు కేవలం ఆశలను మాత్రమే కాదు, హెచ్చరికలను కూడా ఇస్తుంది. నియంత్రణ లేని సాంకేతిక అభివృద్ధి, మానవ విలువల పతనం, పర్యావరణ వినాశనం, యుద్ధాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ముందుగానే చూపించి అప్రమత్తం చేస్తుంది.

శాస్త్రం మన సేవకుడిగా ఉండాలి, అధిపతిగా మారితే ప్రమాదమనే సందేశాన్ని బలంగా నాటుతుంది. సాంకేతిక పురోగతితో పాటు మానవత, నైతిక విలువలు కూడా సమానంగా ముందుకు సాగాలనే ఆలోచనను సైన్స్ ఫిక్షన్ మనకు అందిస్తుంది. నేటి ప్రపంచంలో కృత్రిమ మేధస్సు, స్వయంచాలక యంత్రాలు, డేటా ఆధారిత నిర్ణయాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సైన్స్ ఫిక్షన్ పాత్ర మరింత కీలకం అవుతుంది. తెస్తుంది. భవిష్యత్తును అంధంగా స్వాగతించకుండా, ఆలోచించి అడుగులు వేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. సైన్స్ ఫిక్షన్ దినోత్సవం సందర్భంగా మనం చేసుకోవాల్సినది ఒక్కటే ఊహించడాన్ని తక్కువగా చూడకూడదు. ప్రశ్నించడం తప్పు అనుకోకూడదు.

అనేది కల్పిత ప్రపంచం కాదు. అది రాబోయే కాలానికి మనం రాసుకునే ముందుమాట. ఆ ముందుమాట ఎంత బలంగా, బాధ్యతతో ఉంటేడ రేపటి ప్రపంచం అంత అందంగా, సమతుల్యంగా ఉంటుంది.

# ప్రేమ వివాహం చేసిన యువకుడిపై దాడి

- స్తంభానికి కట్టేసి కొట్టిన యువతి బంధువులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**అమరావతి,వేద న్యూస్ :**

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్న ఒక్క కారణంతో యువకుడిని స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టిన ఘటన ఏలూరు జిల్లాలో కలకలం రేపింది. ముసునూరు మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటనలో, యువతి బంధువులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అమానుషంగా ప్రవర్తించిన తీరు స్థానికులను షాక్‌కు గురిచేసింది. వివరాల ప్రకారం, ముసునూరుకు చెందిన సాయిచంద్, సాయి దుర్గ ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఈ వివాహానికి ఇరు కుటుంబాలు, ముఖ్యంగా యువతి కుటుంబ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంట్లో పెళ్లికి అంగీకరించకపోవడంతో, రెండు రోజుల క్రితం ఈ జంట పరస్పర అంగీకారంతో ప్రేమ వివాహం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సాయి దుర్గ కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. సాయిచంద్‌ను పట్టుకుని గ్రామంలోనే ఒక స్తంభానికి కట్టేసి దారుణంగా కొట్టినట్లు సమాచారం. ప్రేమ వివాహం చేసుకున్నందుకు శిక్షించాలన్న ఉద్దేశంతోనే ఈ దాడి జరిగిందని బాధితుడి వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. యువతి బంధువులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ప్రేమ వివాహాల పేరుతో జరుగుతున్న దాడులు చట్ట విరుద్ధమని, ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పోలీసులు స్పష్టం చేశారు. బాధిత యువకుడికి అవసరమైన రక్షణ కల్పిస్తామని కూడా భరోసా ఇచ్చారు.

# ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్‌లో నూతన సంవత్సర వేడుకలు




- సీఈవో రాజేంద్ర కుమార్ నేతృత్వంలో కేక్ కటింగ్
- సిబ్బందికి డైరీలు, క్యాలెండర్ల పంపిణ

**హైదరాబాద్ వేద న్యూస్ :**

2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయంలో ఆత్మీయ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్ర కుమార్ నేతృత్వంలో ప్రత్యేక కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలు ఐక్యత, కృతజ్ఞత, సేవా సంకల్పాన్ని ప్రతిబింబించాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కొత్త ఏడాదిని నూతన ఉత్సాహంతో, స్పష్టమైన లక్ష్యాలతో ప్రారంభించాలని, సేవా కార్యక్రమాల్లో మరింత నిబద్ధత చూపాలని సీఈవో రాజేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. 2026 సంవత్సరం ఆరోగ్యం, ఆనందం, విజయాలతో నిండాలని ఆయన ఆకాంక్షించారు. సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎన్‌టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, రాబోయే ఏడాదిలో మరిన్ని అవకాశాలు, సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని సంకల్పం వ్యక్తం చేసింది. బృందంగా కలిసి పనిచేస్తూ సమాజాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ట్రస్ట్ సిబ్బంది ఈ సందర్భంగా తెలిపారు.

# ప్రభాస్ 'స్పిరిట్' ఫస్ట్ లుక్ విడుదల..

**వేద న్యూస్ డెస్క్**




రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న భారీ యాక్షన్ చిత్రం 'స్పిరిట్' నుంచి తొలి రూపాన్ని మేకర్స్ విడుదల చేశారు. కొత్త ఏడాది కానుకగా విడుదలైన ఈ పోస్టర్ అభిమానుల్లో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఇటీవలే పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు నెలకొల్పుతోంది. విడుదలైన తొలి రూపంలో ప్రభాస్ పూర్తిగా కొత్త అవతారంలో కనిపించారు. ఒంటిపై చొక్కా లేకుండా, గాయాల ముద్రలతో కిటికీ వద్ద నిలబడి ఉన్న ప్రభాస్ లుక్ తీవ్రమైన భావోద్వేగాన్ని వ్యక్తం చేస్తోంది. డార్క్ గ్లాసెస్, లేత రంగు ప్యాంట్‌తో ఆయన మాస్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన పక్కనే హీరోయిన్ త్రిప్తి దిమ్రి సిగరెట్ వెలిగిస్తూ కనిపించడం పోస్టర్‌కు మరింత ఇంటెన్సిటీని జోడించింది. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ పోస్టర్‌ను సామాజిక మాధ్యమ వేదికలో పంచుకుంటూ, భారతీయ సినిమాకు మరో శక్తివంతమైన పాత్ర రాబోతోందని వ్యాఖ్యానించారు. ప్రభాస్ ఈ చిత్రంలో పోలీస్ అధికారిగా నటిస్తున్నట్లు ఇప్పటికే సమాచారం. యాక్షన్, ఎమోషన్, డార్క్ షేడ్స్‌తో ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించబోతోందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ప్రచార వీడియోకు వచ్చిన స్పందనతోనే 'స్పిరిట్'పై అంచనాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు విడుదలైన తొలి రూపంతో ఆ ఉత్సాహం మరింత పెరిగింది. భారీ బడ్జెట్‌తో, శక్తివంతమైన కథనంతో తెరకెక్కనున్న ఈ చిత్రం ప్రభాస్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకాన్ని అభిమానులు వ్యక్తం చేస్తున్నారు.

## జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా

# కుటుంబంలో తీవ్ర విషాదం

**వేద న్యూస్ డెస్క్:**



జింబాబ్వే క్రికెట్ జట్టు టీ20 కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ సికిందర్ రజా కుటుంబంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన చిన్న సోదరుడు మహమ్మద్ మెహదీ అనారోగ్యంతో కన్నుమూశాడు. ఈ విషాద వార్తను జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. కేవలం 13 ఏళ్ల వయసులోనే మెహదీ మృతి చెందడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. బోర్డు తెలిపిన వివరాల ప్రకారం డిసెంబర్ 29, 2025న హరారేలో మెహదీ తుదిశ్వాస విడిచాడు. పుట్టినప్పటి నుంచే హీమోఫీలియా అనే రక్తసంబంధ వ్యాధితో బాధపడుతున్న అతడు ఇటీవల ఆరోగ్య సమస్యలు తీవ్రమవడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వెల్లడించారు. డిసెంబర్ 30న వారెన్ హిల్స్ సమాధి స్థలంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జింబాబ్వే క్రికెట్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో సికిందర్ రజా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. ఈ క్లిష్ట సమయంలో బోర్డు సభ్యులు, మేనేజ్‌మెంట్, ఆటగాళ్లు, సిబ్బంది అందరూ రజా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. మెహదీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొంది. ఈ వార్తపై సికిందర్ రజా సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. జింబాబ్వే క్రికెట్ బోర్డు ప్రకటించిన సందేశానికి ప్రతిస్పందనగా ఒక విరిగిన హృదయ సూచికను పంచుకుంటూ తన ఆవేదనను వ్యక్తం చేశాడు. సోదరుడి మృతితో రజా కుటుంబం తీవ్రంగా కలత చెందగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెటర్లు, అభిమానులు సంతాప సందేశాలు వెల్లువెత్తిస్తున్నాయి.

# 'ధురంధర్' చిత్రానికి కేంద్రం షాక్..




**వేద న్యూస్ డెస్క్:**

బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టించిన 'ధురంధర్' చిత్రానికి కేంద్ర సమాచార, ప్రసార శాఖ నుంచి ఊహించని షాక్ తగిలింది. దేశవ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకుపోతున్న ఈ సినిమాపై తాజాగా కీలక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. చిత్రంలో వివాదాస్పదంగా మారిన కొన్ని పదాలు, డైలాగులను తక్షణమే తొలగించాలి లేదా మ్యూట్ చేయాలంటూ కేంద్రం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో తరచుగా వినిపిస్తున్న 'బలోచ్' అనే పదంపై అభ్యంతరాలు వ్యక్తమవడంతో, ఆ పదాన్ని మ్యూట్ చేయాలని సూచనలు ఇచ్చినట్లు సమాచారం. సినిమాలో ఒక ప్రధాన పాత్రను 'బలోచ్ ప్రజల మెస్సయ్య'గా చూపించడం, మరో కీలక పాత్ర తాను అదే సామాజిక వర్గానికి చెందినవాడినని చెప్పుకునే సన్నివేశాలు వివాదానికి దారితీశాయి. ఈ ప్రస్తావనలు ఆయా వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయనే ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా సినిమాలో మరో సీనియర్ పాత్ర నోట వినిపించే ఒక డైలాగ్ కూడా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఆ డైలాగ్‌లో బలోచ్ సమాజాన్ని అవమానించేలా వ్యాఖ్యలు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆ డైలాగ్‌ను పూర్తిగా మార్చాలని లేదా తొలగించాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఈ అంశంపై పలు సంఘాలు నిరసన వ్యక్తం చేయడంతో కేంద్రం వేగంగా స్పందించినట్లు తెలుస్తోంది. జనవరి 1 నుంచి థియేటర్లలో పాత వెర్షన్‌కు బదులుగా సవరించిన కొత్త వెర్షన్‌ను మాత్రమే ప్రదర్శించాలని పంపిణీదారులు, థియేటర్ యాజమాన్యాలకు ఈమెయిల్ ద్వారా సూచనలు పంపినట్లు సమాచారం. ఈ మార్పులు అమలులోకి రాకపోతే కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించినట్లు తెలిసింది. డిసెంబర్ 5, 2025న విడుదలైన ఈ చిత్రం దేశవ్యాప్తంగా వచ్చిన ఈ ఆదేశాలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. సినిమా విజయం కొనసాగుతున్న వేళ ఇలాంటి సెన్సార్ మార్పులు ప్రభావం చూపుతాయా? లేక ప్రేక్షకులు వాటిని పట్టించుకోకుండా ఆదరిస్తారా? అనే అంశంపై ఇప్పుడు పరిశ్రమలో చర్చ జరుగుతోంది. ఏదేమైనా కేంద్ర ఆదేశాలతో 'ధురంధర్' మరోసారి వార్తల్లో నిలిచింది.

# వన్డే జట్టు 2025 కెప్టెన్‌గా రోహిత్..

**వేద న్యూస్ డెస్క్:**




వన్డే క్రికెట్‌లో 2025 సంవత్సరానికి అత్యుత్తమంగా రాణించిన ఆటగాళ్లతో వన్డే జట్టు 2025ను ప్రకటించారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మకు ఈ జట్టుకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. నిరుడు ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను విజేతగా నిలిపిన రోహిత్, ఓపెనర్‌గా కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. టాప్ ఆర్డర్‌లో మరో భారత స్టార్ విరాట్ కోహ్లీ మూడో స్థానంలో నిలవగా, ఇంగ్లండ్ దిగ్గజం జో రూట్ నాలుగో స్థానంలో ఎంపికయ్యాడు. 2025లో వన్డేల్లో అద్భుత ప్రదర్శన చేసిన ఆటగాళ్లతో ఈ జట్టును ఎంపిక చేశారు. ఓపెనర్‌గా రోహిత్‌కు జోడీగా దక్షిణాఫ్రికా యువ బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్‌కు అవకాశం లభించింది. దక్షిణాఫ్రికాపై శవన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు మరోసారి తమ అనుభవంతో జట్టులో చోటు సంపాదించుకోవడం విశేషం. 2025లో వన్డే క్రికెట్‌ను ప్రభావితం చేసిన ఆటగాళ్లతో రూపొందిన ఈ జట్టు అభిమానుల్లో ఆసక్తిని రేపుతోంది. వన్డే జట్టు 2025లో ఎంపికైన ఆటగాళ్లు: రోహిత్ శర్మ (కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్, విరాట్ కోహ్లీ, జో రూట్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ శాంట్నర్, ఆదిల్ రషీద్, జోఫ్రా ఆర్చర్, మ్యాట్ హెన్రీ, జైడెన్ సీల్స్.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073